



(గత సంచిక తరువాయి)

నిమ్మ నారింజ, ద్రాక్ష ఎరుపుకి కాస్త దగ్గరగా వున్న రంగైతే చాలు. అన్ని రకాల తలకాయలు అక్కడ ప్రత్యక్షమై పోయాయి. అయితే స్పాల్డింగ్ చెప్పినట్లు ఎర్రని ఎరుపులో భగభగా మండిపోయేలాంటి తలకాయలు మాత్రం వాటిలో ఎక్కువగా లేవు.

అంతమంది అభ్యర్థుల్ని ఒకేసారి చూసే సరికి విల్సన్ బెదిరిపోయాడు. వెంటనే ఆ ప్రయత్నం మానుకుని వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనుకున్నాడు గానీ స్పాల్డింగ్ వదనివ్వలేదు. ఎలా వేయగలిగాడో తెలీదు. అంతమందిలో దారి వేసుకుంటూ అతన్ని ఆఫీసు మెట్లదాకా తోసుకెళ్లిపోయాడు.

అక్కడ రెండువరసల మెట్లున్నాయి. ఒక వరస వెంబడి కొందరు ఆశ నిండిన మొహాల్తో పైకెళ్తుంటే రెండో వరస వెంబడి మరికొందరు నిరాశగా కిందికి దిగిపోతున్నారు.

ఎలాగైతేనేం, చివరికి వాళ్ళిద్దరూ ఆఫీసు గది లోకి వెళ్ళి పడ్డారు.

★ ★ ★

"మీ అనుభవం వింటుంటే చాలా సరదాగా వుంది."

ముక్కు పొడుం పీల్చడం కోసం అతనాగి నప్పుడు వ్యాఖ్యానించాడు హోమ్స్.

"వింటానికి ఆసక్తికరంగా కూడా వుంది ఆ తర్వాతేం జరిగిందో చెప్పండి" అన్నాడు.

మిస్టర్ విల్సన్ ఘాటుగా ముక్కుపొడుం ఎగ పీల్చి తిరిగి చెప్పనారంభించాడు.

★ ★ ★

రెండు కుర్చీలూ ఓ బల్ల తప్ప ఆ ఆఫీసులో మరింకేం లేవు.

బల్ల వెనక కురచగా వున్న ఓ మనిషి కూర్చు న్నాడు. అతని తలకాయ తనకంటే ఎర్రగా వుంది. లోనికొచ్చిన ప్రతి అభ్యర్థితో చాలా కొద్దిగా మాట్లాడుతున్నాడతను. తర్వాత ఏదో వంకపెట్టి అందర్నీ తరిమేస్తున్నాడు.

అక్కడ ఉద్యోగం సంపాయించడం అను కున్నంత సులభంగా కనిపించ లేదు.

చివరికి తనవంతు రానేవచ్చింది.

తన జుట్టు వంక చూస్తూనే మిగతా వాళ్ళ విషయంలో కంటే ప్రసన్నంగా కనిపించా డతను. తామిద్దరూ లోనికి వెళ్తూనే తమతో ప్రైవేటుగా ఏదో మాట్లాడాల్సింది వుందన్నట్టుగా లేచివెళ్ళి గది తలుపు మూసే శాడు.

"వీరి పేరు జాబెజ్ విల్సన్. మీ దగ్గర వుద్యోగం కోసం వచ్చారు" అంటూ పరిచయం చేశాడు స్పాల్డింగ్.

"ఓహ్, ఈ వుద్యోగానికి వీరు సరిగ్గా సరి పోతారు. మాక్కావల్సిన అర్హతలన్నీ వీరికున్నాయి. ఇంత చక్కని ఎర్ర జుట్టు నేనెప్పుడూ చూడలేదు" అన్నాడా మనిషి.

ఓ అడుగు వెనక్కి వేసి తల ఓ పక్కకు వేలాడేస్తూ అతను తన జుట్టుకేసి కళ్ళప్పగించి చూస్తుంటే తనకే సిగ్గేసినట్టయ్యింది.

అతను అంతలోకే అకస్మాత్తుగా ముందు కొచ్చేసి విల్సన్‌కు షేక్ హేండిచ్చాడు.

"కంగ్రాచులేషన్స్ మిస్టర్ విల్సన్. ఈ వుద్యోగం మీదే. అయితే చిన్న పరీక్ష ఒక టుంది. మిమ్మల్ని సందేహించడం న్యాయం కాదనుకోండి. అయినా మా జాగ్రత్తలో మేముండక తప్పదు. మీరు నన్ను క్షమిస్తారనే విశ్వాసం నాకుంది" అంటూ విల్సన్ జుట్టు గబుక్కున రెండు చేతుల్తో దొరక బుచ్చు కున్నాడు.

బాధ భరించలేక కెవ్వున కేకేశాడతను.

"అదిగో, మీ కన్నీళ్ళొస్తు న్నాయ్" చివరికి తన జుట్టు వదిలేస్తూ అన్నాడత ను.

"మరేం లేదు, అంతా సక్రమంగా వుండాల నేదే మా ఆకాంక్ష. మా జాగ్రత్తలో మేముండాలి. రెండుసార్లు విగ్గుల మూలంగా మోసపోవల్సి వచ్చింది. ఓ సారేమో ఒకతను జుట్టుకు రంగేసు కొచ్చాడు. మీకో రహస్యం చెప్పనా? ఎర్ర బూటు పాలిషు తలకు రుద్దుకొస్తే చాలా సహ జంగా కనబడుతుంది" అంటూ కిటికీ దగ్గరికి నడిచాడు.



ఆర్థర్ కానన్ డాయల్

ఉద్యోగం ఖాళీ నిండిపోయిందని అతను బయటున్న వాళ్ళతో కేకేసి చెప్పేసరికి నిరాశతో నిండిపోయిన స్వరాలు కలగాపులగంగా వినిపించ నారంభించాయి. వాళ్ళందరూ తలా ఓదారి పట్టారు. చివరికి విల్సన్, అతని మేనేజరు తప్ప ఒక్క ఎర్రతలకాయ కూడా అక్కడ మిగల్లేదు.

"నా పేరు డంకన్ రాస్" పరిచయం చేసుకున్నాడతను. "ఎజ్కియా హాప్కిన్స్ గారు వదిలి వెళ్ళిన ధనరాశి మూలంగా లాభం పొందుతున్న వాళ్ళలో నేనూ ఒకణ్ణి. ఇంతకీ మీకు పెళ్ళయిందా మిస్టర్ విల్సన్? ఫ్యామిలీ వుందా?" అంటూ క్రాస్ వేశాడు.

తనకు ఫ్యామిలీ లేదని అతన్తో చెప్పాడు విల్సన్.

ఆ మాట విన్న వెంటనే మొహం వేలాడేశాడతను.

"దటీజ్ సీరియస్. మీరలా చెప్పడం నాకు చాలా బాధగా వుంది. యూ సీ మిస్టర్ విల్సన్, ఎజ్కియా హాప్కిన్స్ గారు వదిలి వెళ్ళిన మూల ధనం కేవలం ఎర్రజుట్టున్న వాళ్ళ బతుకుతెరువు కోసం మాత్రమే కాదు. ఎర్రతలకాయలు తామరతంపరగా వృద్ధి చెందడానిక్కూడా వుద్దేశించింది. మీరు బ్రహ్మచర్యం చేస్తుండడం చాలా దురదృష్టం" అన్నాడు.

విల్సన్ మొహం వాడిపోయింది. ఉద్యోగం రావడం, పోవడం అంతా ఒకేసారి జరిగిపోయాయేమిటా అనిపించింది. అయితే డంకన్ రాస్ కాసేపు ఆలోచించిన మీదట మరేం ఫర్వాలేదంటూ ధైర్యం చెప్పాడతనికి.

"మరొకరి విషయంలో అయితే ఆ అభ్యంతరానికి విలువుండేదనుకోండి. అయితే మీ బోటి ఎర్రతలకాయ విషయంలో కాస్త పక్షపాతం చూపించకపోతే అస్సలు బావుండదు. మీరెప్పుడు డ్యూటీలో చేర్తారు?" అన్నాడు.

"ఎలా చెప్పాలో తోచడం లేదు. నాకిదివరకే వ్యాపారం ఒకటుండిపోయింది" చెప్పాడు విల్సన్.

"అయ్యగారూ, ఆ విషయం గురించి మీరేం బెంగెట్టుకోకండి. మీ వ్యాపారం సంగతి నేను చూసుకుంటాలెండి," అంటూ హామీ ఇచ్చాడు స్పాల్డింగ్.

"పనివేళలేమిటో చెప్పండి" అన్నాడు విల్సన్.

"ఉదయం పదింటినుంచీ మధ్యాహ్నం రెండింటిదాకా" చెప్పాడు డంకన్ రాస్.

విల్సన్ తాకట్టు వ్యాపారం ముమ్మరంగా జరిగేది సాయంకాలాలు మాత్రమే. ముఖ్యంగా శనివారం నాడు తీసుకునే జీతాలు అందరికీ బుధవారం నాటికే అయిపోతాయి కాబట్టి గురువారం, శుక్రవారం సాయంకాలాలు అతని కొట్లో ఎక్కువ రద్దీగా వుంటుంది. ఉదయం పూట తను కొట్లో వుండి చేసేదేం వుండదు. అదనంగా డబ్బు సంపాయించాలంటే ఆ సమయమే తనకు చాలా అనుకూలంగా వుంటుంది. అదీగాక తన గుమస్తా కూడా మంచివాడు. అంతగా ఏదైనా అవసరం వస్తే అతనే చూసుకోగలడు.

"సరే, పొద్దున పూట మీ దగ్గర పనిచేయడానికి నా అభ్యంతరమేం లేదు. జీతం ఎంతిస్తారు?"

"వారానికి నాలుగు పౌండ్లు."

"నేను చేయాల్సిన పనేమిటి?"

"పని నామమాత్రమే లెండి."

"నామ మాత్రమే అంటే?"

"పనివేళల్లో మీరు పూర్తిగా ఆఫీసులోనే వుండాలి. ఇక్కడ్నుంచి కదిలారంటే మాత్రం వుద్యోగం వూడిపోతోంది. ఎజ్కియా హాప్కిన్స్ గారి వీలునామాలో ఆ విషయం స్పష్టంగా వుంది. ఆ తర్వాత మీరు విచారిస్తే లాభం లేదు."

"రోజుకు నాలుగ్గంటలే కదా, బయటికెళ్ళే విషయమే ఆలోచించన్లెండి" అన్నాడు విల్సన్.

"తర్వాత క్షమాపణలు చెప్పుకున్నా లాభం వుండదు" హెచ్చరించాడు డంకన్ రాస్. "రోగమే రానివ్వండి. వ్యాపారమే పోనివ్వండి. మీరేమైనా కానివ్వండి. ఇక్కడ్నుంచి కదలడానికి మాత్రం వీల్లేదంతే. కదిలారంటే వుద్యోగం పోతుంది."


"ఇంతకీ పనేమిటో మాత్రం చెప్పారే కాదు."

"పనంటే ఏముందిలెండి— ఎన్సైక్లోపీడియా బ్రిటానికా కాపీ చేస్తూ కూర్చోవడమే పని. పుస్తకం మొదటి వాల్యూం ఆ సొరుగులో వుంది. పెన్నులూ కాగితాల్లాంటివన్నీ మీరే తెచ్చుకోవాలి. ఈ కుర్చీబల్లా మాత్రం మేమిస్తాం. రేపటికల్లా మీరు సిద్ధంగా వుంటారా?"

"తప్పకుండా" అన్నాడు విల్సన్.

"అయితే గుడ్ బై మిస్టర్ జాబెజ్ విల్సన్. ఈ వుద్యోగం సాధించినందుకు మరోసారి మిమ్మల్ని అభినందిస్తున్నాను" అంటూ సాదరంగా అతన్ని బయటికి సాగనంపాడు డంకన్ రాస్.

స్పాల్డింగ్‌ని వెంటేసుకుని అక్కడ్నుంచి నేరుగా ఇంటికి వెళ్ళాడు విల్సన్. ఆనందంతో అతని కాలూ చెయ్యీ ఆడుతున్నట్టుగా లేదు. తన అదృష్టానికి తనే పొంగిపోతున్నాడు.



## అవన్నీ రూమర్లు



మాధురీదీక్షిత్ తను పెళ్ళి చేసుకో బోతున్నారంటూ వెలువడిన వార్తలు అన్నీ అసత్యమనీ, ఆధారం లేనివనీ అంటున్నాడు సంజయ్‌దత్. నా భార్య రిచా, నా కుమార్తె త్రిశాలను నేను ప్రేమగా చూసుకుంటాను అన్నాడు సంజయ్ దత్.

ఆ రోజంతా ఆ విషయం గురించే ఆలోచిస్తుండిపోయాడు. ఆలోచించేకొద్దీ అతన్లో ఉత్సాహం నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. అంతా ఏదో మోసంలా అనిపించసాగింది. అసలు వాళ్ళ వుద్దేశమేమిటో అతనికి సరిగ్గా అర్థం కాలేదు. అలాంటి వీలునామా ఎవరైనా రాస్తారా? ఓ పుస్తకం కాపీ చేసే పున్యానికి అంత డబ్బెవరైనా ఇస్తారా?

అతని గుమస్తా ఆ రోజంతా అతన్ని ఉత్సాహపరచడానికి ప్రయత్నిస్తూనే వున్నాడు. అయితే విల్సన్ మాత్రం ఆ ఆలోచనల్లోంచి తేరుకోలేకపోయాడు. చివరికి నిద్రపోయేవేళకు ఆ వ్యవహారం నుంచి తప్పుకుందామని తీర్మానించుకున్నాక గానీ అతనికి సుఖంగా నిద్రపట్టలేదు.

అయితే, తెల్లారేసరికల్లా అతని ఆలోచన మళ్ళీ మారిపోయింది. అసలు సంగతేమిటో ఓసారి చూసి తీరాల్సిందేనని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత ఓ పెన్నూ, ఇంకు బాటిలూ, అరడజను తెల్లకాగితాలూ కొనుక్కొని పోపుగారి నానిడికి బయల్దేరాడు.

అయితే అనుకన్నదానికి విరుద్ధంగా అక్కడంతా సవ్యంగానే కనిపించేసరికి అతనికి ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగింది. టేబుల్ అతని కోసం సిద్ధంగా వుంది. తన చేత పని సక్రమంగా జరిపించడానికి డంకన్ రాస్ కూడా అక్కడే వున్నాడు.

ఎన్‌సైక్లోపీడియాలో 'ఏ' అనే అక్షరం నుంచి పని ప్రారంభించవలసిందిగా విల్సన్‌కు పురమాయించి అతను బయటికి వెళ్ళిపోయాడు. అయితే విల్సన్ సరిగ్గా పనిచేస్తున్నాడో లేదో చూడ్డానికి మధ్యలో అప్పుడప్పుడు వూడిపడుతూనే వున్నాడు.

మధ్యాహ్నం రెండయేసరికి డెస్కుముందు నుంచి లేచాడు విల్సన్. అంతలో డంకన్ రాస్ మళ్ళీ అక్కడికొచ్చాడు. విల్సన్ రాసిందంతా చూసి అతన్ని అభినందించాడు. తర్వాత అతను బయటికొచ్చేశాక ఆఫీసుకు తాళం వేశాడు.

అది మొదలు ప్రతిరోజూ అదే కార్యక్రమం కొనసాగుతూ వచ్చింది. శనివారం నాడు డంకన్ రాస్ నాలుగు బంగారు నాణాలు తంచనుగా తెచ్చి విల్సన్ ముందు పడేశాడు. రెండోవారం కూడా అలాగే జరిగింది. మూడోవారం కూడా అంతే. పొద్దున పదింటికి ఖచ్చితంగా పనికి హాజరై పోవడం, మధ్యాహ్నం రెండింటికల్లా ఇంటికి తిరిగి రావడం. క్రమంగా డంకన్ రాస్ ఉదయం పూట మాత్రమే అక్కడ కనిపించడం మొదలెట్టాడు. ఆ తర్వాత అదీ లేదు. అయినా విల్సన్ మాత్రం ఆ గదిలోంచి కదలడానికి సాహసించలేకపోయేవాడు. రాస్ ఏ క్షణంలో వూడిపడతాడో తెలీదు. అంతమంచి వుద్యోగం వూడగొట్టుకోవడం అతనికేమాత్రం ఇష్టం లేకపోయింది.

ఆ విధంగా ఎనిమిది వారాలు గడిచిపోయాయి. 'ఏ' అనే అక్షరంతో మొదలయే పదాలన్నీ కాపీ చేయడం దాదాపు పూర్తయిపోయింది. ఇక త్వరలో 'బీ' అనే అక్షరాన్ని ప్రారంభించాలనుకుంటున్నాడు. అప్పటికే కాగితాలకోసం అతను సుమారుగా ఖర్చుపెట్టాల్సి వచ్చింది. అతను రాసిపెట్టిన కాగితాల్తో ఓ సొరుగు పూర్తిగా నిండిపోయింది.

అయితే అంతలోకే ఆ వ్యవహారం మొత్తం అకస్మాత్తుగా ముగిసిపోయింది.

★ ★ ★

"అప్పుడే ముగిసిపోయిందా?" అన్నాడు షెర్లాక్ హోమ్స్.

"అవున్సార్. ఈ రోజు ఉదయం మామూలుగా పదింటికి నేనక్కడికి వెళ్ళాను. అయితే తలుపుకు తాళం వేసుంది. ఈ బోర్డు అక్కడ వేలాడుతోంది" అంటూ నోటు పేపరు సైజులో వున్న కార్డుబోర్డు ఒకదాన్ని మాకు చూపించాడు విల్సన్.

అందులో ఇలా రాసుంది—

'ఎర్రతలకాయల సంఘం అక్టోబరు 9, 1890వ తేదీ నుండి రద్దయిపోయినది!'

నేనూ, షెర్లాక్‌హోమ్స్ కాసేపు ఆ బోర్డుని పరీక్షగా చూస్తుండిపోయాం. తర్వాత ఇద్దరం ఒకేసారి గట్టిగా నవ్వేశాం.

"ఇందులో నవ్వడానికేముందో నాకర్థం కావడం లేదు. గుర్రుగా చూస్తూ అన్నాడు మా క్లయింట్. అతని మొహం ఇంకా టమేటా పండులా ఎర్రపడిపోయింది. "నవ్వడం తప్ప మీరింకేం చేయలేమంటే నేను ఇంకో చోటికి పోగల్ను" అంటూ రోషంగా కుర్చీలోంచి లేచబోయాడు.

"అహహ" అంటూ అతన్ని మళ్ళీ నిశితంగా కుర్చీలో కూర్చోబెట్టాడు హోమ్స్. "ఆరు నూరైనా మీ కేసు మాత్రం నేనొదులుకోను. ఇది అసాధారణమైన కేసు కావడం వల్ల మాకు చాలా ఉల్లాసంగా వుంది. దాంతోపాటు ఇందులో వ్యవహారం కొంచెం తమాషాగా కూడా వుంది. సరే, ఈ బోర్డు చూశాక మీరేం చేశారో చెప్పండి" అన్నాడు.

"దీన్ని చూస్తూనే నాకు మతిపోయినట్టయింది. ఏం చేయాలో తోచలేదు. ఆ చుట్టుప్రక్కల ఆఫీసుల్లో విచారించాను. అయితే అక్కడున్న వాళ్ళెవరికీ దీని గురించేం తెలీదు. చివరికి నేను బిల్డింగు యజమాని దగ్గరికి వెళ్ళాను. ఆయనో అకౌంటెంటు. అదే బిల్డింగు కింది నాటాలో వుంటున్నాడు. ఎర్రతలకాయల సంఘం ఏమైందని ఆయన్నడిగాను. అలాంటి సంఘం ఒకటుందని కూడా తనకు తెలీదన్నాడు. అప్పుడు డంకన్ రాస్ గురించి అడిగాను. ఆ పేరు అప్పుడే కొత్తగా వింటున్నానన్నాడు.

"నాలుగో నెంబరు నాటాలో వుండే పెద్ద మనిషండీ" అన్నాడు.

"ఎవరూ ఆ ఎర్రజుట్టుతనా" అన్నాడతను.

"అవునన్నాడు."

"ఓ, ఆయన పేరు డంకన్ రాస్ కాదండీ— విలియం మోరిస్. ఆయన ప్లీడరు. తన ఆఫీసు గది ఇంకా తయారుకాలేదని తాత్కాలికంగా కొన్నాళ్ళు మా గది ఉపయోగించుకున్నాడు. నిన్ననే ఖాళీచేసి వెళ్ళిపోయాడు. అనే సమాధానం వచ్చింది.

"ఆయనెక్కడ దొరుకుతాడ"ని అడిగాను.

"వాళ్ళ కొత్తాఫీసులో దొరుకుతాడు. నాకు అడ్రసిచ్చి వెళ్ళాడు. డోర్ నెంబరు 17, ఎడ్వర్డ్ రాజు గారి వీధి, సెయింట్ పాల్ చర్చి దగ్గర" అని చెప్పాడతను.

"నేను అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాను. అయితే ఆ అడ్రసులో వున్నది మాత్రం కృత్రిమ పాదాలు తయారుచేసే ఫ్యాక్టరీ. అక్కడ విలియం మోరిస్ గురించి గానీ, డంకన్ రాస్

గురించి గానీ ఎవరూ చిన్న సాహస పోలేదు.''

"ఆ తర్వాతేం చేశారు?'' అడిగాడు హోమ్స్.

"అక్కడ్నించి కోబర్ స్క్వేరుకు తిరిగి వెళ్ళిపోయి ఏం చెయ్యాలని మా గుమస్తా నడిగాను. అతనూ ఏం చెప్పలేకపోయాడు. కొన్నాళ్ళు వేచి చూస్తే పోస్టు ద్వారా ఏమైనా తెలియ వచ్చన్నాడు. అయితే ఆ మాట మాత్రం నాకు నచ్చలేదు మిస్టర్ హోమ్స్. అంత మంచి ఉద్యోగాన్ని వూరికే వదిలేసుకోవడం నాకిష్టం లేదు. నాలాంటి వాళ్ళకి మీరు మంచి సలహాలు ఇస్తుంటారని విన్నాను. దాంతో నేరుగా మీ దగ్గరి కొచ్చాను.''

"చాలా మంచి పనిచేశారు. మీ కేసు నేను సంతోషంగా తీసుకుంటాను. మీరు చెప్పింది వింటుంటే పైకి కనిపించేదానికంటే ఇది పెద్ద కేసే అనిపిస్తోంది'' అన్నాడు హోమ్స్.

"అవునవును, పెద్దకేసే మరి. నేను వారానికి నాలుగు పౌండ్లు పోగొట్టుకున్నాగా'' అన్నాడు జాబెజ్ విల్సన్.

"కాదు నిజానికి చెప్పాలంటే ఇప్పటికి మీరు ముప్తై పౌండ్ల దాకా లాభమే సంపాయించుకున్నారు. ఇకపోతే 'ఏ' అనే అక్షరంలో వచ్చే పదాల గురించి మీకొచ్చిన అపారమైన విజ్ఞానం సంగతి చెప్పనే అక్కర్లేదు. ఈ వ్యవహారంలో మీరు నష్టపోయిందేం లేదు. కాబట్టి వ్యక్తిగతంగా చెప్పాలంటే ఈ విచిత్రమైన సంఘం మీద మీరు కోపం పెట్టుకోవల్సిన అవసరం లేదు.''

"లేదనుకోండి. అయితే వాళ్ళ గురించి నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. వాళ్ళెవరు? ఎందుకు నామీద ఇలాంటి జోకు వేశారు. ఇది వాళ్ళకు చాలా ఖరీదైన జోకనే చెప్పాలి. ముప్పై రెండు పౌండ్లు ఖర్చు పెట్టాల్సి వచ్చింది గదా!''

"మీ తరపున ఆ విషయాలన్నీ తెలుసుకుంటాం లెండి. ముందుగా రెండు మూడు ప్రశ్నలు మిమ్మల్ని అడగాలి. ఈ ప్రకటన మీకు తెచ్చి చూపించాడే— మీ గుమస్తా అతనెంత కాలం నుంచి మీ దగ్గర పనిచేస్తున్నాడు?''

"దాదాపు ఓ నెల రోజుల్నించి''

"అతను మీ దగ్గరికెలా వచ్చాడు?''

"నాకు గుమస్తా కావాలని పేపర్లో ప్రకటన వేశాను.''

"అతనొక్కడేనా వచ్చింది?''

"కాదు, ఓ డజను మంది వచ్చి వుంటారు''

"మీరితన్నే ఎందుకు ఎంచుకున్నారు?''

"ఎక్కడికీ వెళ్ళకుండా నా చేతికి అందుబాటులో వుంటాడు గదా అని. పైగా చాలా చవగ్గా కూడా వస్తున్నాడాయె.''

"చవగ్గా అంటే సగం జీతానికి వస్తున్నాడనేగా?''

"అవును''

"ఈ విన్సెంట్ స్పాల్డింగ్ చూడ్డానికెలా వుంటాడు?''

"కురచగా బొద్దుగా వుంటాడు. చాలా చురుకైన మనిషి. ముప్పై ఏళ్ళకు తక్కువుండకపోయినా మొహం మీద ఒక్క వెంట్రుకైనా వుండదు. నుదుటి మీద ద్రావకం పడ్డట్టుగా తెల్లమచ్చ ఒకటుంది.''

హోమ్స్ అకస్మాత్తుగా కుర్చీలో నిటారుగా అయిపోయాడు. అతని మొహంలో ఉద్వేగం కొట్టొచ్చినట్టు కనబడింది.

"అనుకున్నాను. అతనికి చెవులు కుట్టిన రంధ్రాలున్నాయా?'' అన్నాడు.

"ఉన్నాయి సార్. ఎవరో జిప్సీ తన చిన్నప్పుడలా చెవులు కుట్టాడని చెప్పాడు.''

"ఊ!'' కుర్చీలో మళ్ళీ వెనక్కి వాలుతూ ఏదో ఆలోచనలో పడిపోయాడు హోమ్స్.

"అతనింకా మీ దగ్గరే పనిచేస్తున్నాడన్నారు కదూ?'' అన్నాడు నెమ్మదిగా.

"అవును. ఇందాకే అతన్తో మాట్లాడి వస్తున్నాను.''

"మీరు కొట్లో లేని సమయంలో అతను మీ వ్యాపారం ఎలా చూసుకున్నాడు?''

"పేరు పెట్టడానికి వీల్లేదు సార్. పొద్దున పూట జరిగే వ్యాపారం కూడా ఏం లేదనుకోండి, అది వేరే సంగతి.''

"సరే మిస్టర్ విల్సన్. ఒకటి రెండు రోజుల్లో అసలు విషయం మీకు తేల్చి చెబుతాను. ఈ రోజు శనివారం కదా. సోమవారానికి మనం ఓ పరిష్కారానికి రావచ్చు'' అన్నాడు షెర్లాక్ హోమ్స్.

"ఏమంటావు వాట్సన్, అంతా విన్నాక నీకేమనిపిస్తుంది?'' విల్సన్ వెళ్ళిపోయాక నా వైపు తిరుగుతూ అడిగాడు.

"నాకు తలా తోకా తెలియడం లేదు. ఇదేదో పెద్ద మిస్టరీలాగే వుంది'' నిజాయితీగా అన్నాను.

"రూలు ప్రకారం ఒక విషయం ఎంత విచిత్రంగా వుంటుందో అందులో మిస్టరీ అంత తక్కువగా వుంటుంది. సాధారణంగా కనిపించే మొహాన్ని గుర్తుపెట్టుకోవడం ఎంత కష్టమో సాధారణమైన నేరం కూడా అంత జటిలమే. ఏమైనా నేను మాత్రం ఈ కేసులో జాగ్రత్తగా వుండాలి.''

"అయితే ఇప్పుడు నువ్వేం చేయబోతున్నావు?'' అడిగాను.


"ప్రస్తుతానికి దమ్ముకొట్టబోతున్నాను. కనీసం ఓ మూడు పైపులు తగలేస్తే గానీ తేలని విషయమిది. దయచేసి ఓ యాభై నిమిషాలు నన్ను పలకరించకు'' అంటూ అతను కుర్చీలో ముడుచుకున్నాడు. పల్చటి మోకాళ్ళకు తన గద్దముక్కు ఆనించి కళ్ళు మూసుకున్నాడు. ఆ సమయంలో అతని నోట్లో వెలుగుతున్న పైపు ఏదో వింత పక్షి తోకలా కనిపించింది.

చాలకం చూస్తే అతనలాగే నిద్రపోయినట్టుగా అనిపించడంతో అతన్ని చూసి నేనూ కునికిపాట్లు పడనారంభించాను. అంతలోకే అతను కుర్చీలోంచి దిగ్గున లేచి నిలబడిపోతూ ఏదో గట్టి నిర్ణయానికి వచ్చేసినవాడిలా నోట్లోంచి పైపు తీసి బల్లమీద పడేశాడు.


"సెయింట్ జేమ్స్ హాల్లో ఈ మధ్యాహ్నం సరసాటే గారి సంగీత కచేరీ జరుగుతుంది.

(ఇంకావుంది)

# గర్ల్ ఫ్రెండ్ హోదాలో దివ్య



**దివ్యభారతి, ఆమె బాయ్ ఫ్రెండ్ సాజిద్ నదియాద్‌వాలాలు విడిపోయేరన్న వార్తలు వస్తూనే వున్నాయి ఓ పక్క. కాని, బెంగుళూరులో జరుగుతున్న సాజిద్ స్వంత చిత్రం 'వక్త్ హమారా హై' షూటింగుకి వెళ్ళింది దివ్యభారతి. నిజానికి ఆ చిత్రంలో ఆమె నటించడం లేదు. కాని, సాజిద్ గర్ల్ ఫ్రెండ్ హోదాలో ఆమె ఆ షూటింగుకి హాజరైంది.**



# షెర్లాక్ హోమ్స్ కథలు

### సర్ ఆర్థర్ కానన్ డాయల్

## ఎర్ర తలకాయల సంఘం

### దాదా హయాత్

(గత సంచిక తరువాయి)

''ఏమంటావువాట్సాన్? నీ పేషెంట్లు కొద్దిగంటలసేపు నిన్ను వదిలి పెడతారా?'' అన్నాడు.

''ఈ రోజు నాకు పెద్ద పనంటూ ఏం లేదు. అయినా నాకు ప్రాక్టీసు ఎక్కడుండి ఏడ్చింది కనుక'' అన్నాడు.

''అయితే మరి నెత్తిన హ్యాటు పెట్టుకు బయద్దేరు. ముందు సిటీలోకి వెళ్దాం. మధ్యానం భోజనం బయటే వేద్దాం. ఈ ప్రోగ్రాంలో జర్మనీ పంగీతం బోలెడుంటుందట. ఫ్రెంచి, ఇటాలియన్ మ్యూజిక్ కంటే జర్మనీ పంగీతమంటేనే నాకిష్టం. బుర్రకు బాగా పదును పెడుతుంది. పద అంటూ నన్ను చెయ్యిపట్టి లేవదీశాడు.

అండర్ గ్రౌండ్ రైల్లో కూమని మేము ఆల్డర్స్ గేటు దాకా వెళ్ళాం. అక్కడ్నించి జాబ్ జ్ విల్సన్ నివసించే కోబర్గ్ స్క్వేరు వాలా దగ్గర కావడంతో అక్కడికి కాలి నడకన చేరుకున్నాం. తాతల కాలం నాటి రెండస్తుల మేడలు విచారంగా నిలబడి వున్నాయక్కడ. వాటి లాన్ల లోని పూల పొదలూ, గడ్డిమొక్కలూ పొయ్యి గూళ్ళపొగతో కలుషితమైపోయిన వాతావరణంతో పోరాటం జరుపుతున్నట్టుగా వున్నాయి.

అక్కడో మూలగా వున్న ఇంటి ముందు 'జాబ్ జ్ విల్సన్' అనే సైను బోర్డు కనిపించడంతో అదే అతని ఇల్లని గుర్తుపట్టాం. షెర్లాక్ హోమ్స్ ఆ ఇంటి ముందాగి తల ఓ పక్కకు వేలాడేస్తూ ఆ ఇంటినే పరీక్షగా చూస్తూ నిలబడ్డాడు. అతని కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి.

కాసేపటి తర్వాత అతనక్కడ్నించి కదిలి ఆ వీధిలో ఈ మూల నుంచి ఆ మూలదాకా వర్సగా వున్న ఇళ్ళని చూసుకుంటూ వెళ్ళాడు. చివరికి మళ్ళీ విల్సన్ గారింటి దగ్గరికి తిరిగొచ్చి చేతి కర్రతో పేవ్‌మెంట్ మీద గట్టిగా రెండు మూడుసార్లు కొట్టాడు. తర్వాత ముందుకు వెళ్ళి ఆ ఇంటి తలుపు తట్టాడు.

ఓ యువకుడు తలుపు తెరుచుకుని బయటికొచ్చాడు.

చూడ్డానికి చాలా చురుగ్గా కనిపిస్తున్నాడతను. గడ్డం మీసాలు లేవు. తలుపు తెరుస్తూనే మమ్మల్ని లోపలికి ఆహ్వానించాడు.

''థాంక్యూ నేనిక్కడికి తాకట్టు పెట్టడానికి రాలేదు. స్ట్రాండ్‌కి దారెటో కాస్త చెప్తారా?'' అన్నాడు హోమ్స్.

''అక్కడ్నించి కుడివైపు తిరిగి మళ్ళీ ఎడంవైపు వెళ్ళండి'' అంటూ గమ్మున తలుపు మూసేసుకున్నాడతను.

మేమిద్దరం అక్కడ్నించి కదిలాం.

''వాడో జగత్కిలాడీ. వాడి గురించి నాకు ముందే తెలుసు'' అన్నాడు హోమ్స్.

''ఈ ఎర్రతలకాయల మిస్టరీతో విల్సన్ గారి గుమస్తాకి ఏదో సంబంధం వుందని తెలుస్తూనే వుంది. అతన్ని చూడ్డానికే ఇక్కడికొచ్చావా?'' అడిగాను.

''అతన్ని చూడ్డానికి రాలేదు''

''మరి?''

''మోకాళ్ళ దగ్గర అతని పాంటు చూడ్డానికి''

''ఏం కనిపించింది?''

''నేనేమనుకున్నానో అదే కనిపించింది.''

''అవునూ, ఇందాక పేవ్‌మెంటు మీద అలా కొట్టావెందుకు?''

''మైడియర్ డాక్టర్, ఇది మాటల్తో పొద్దుపుచ్చాల్సిన సమయం కాదు. పరిశోధన జరపాల్సిన సమయం. ప్రస్తుతం మనిమిక్కడ శత్రుదేశంలో ప్రవేశించిన గూఢచారులం. శాక్స్—కోబర్గ్ స్క్వేరు గురించి మనకేదో కొంత తెలిసింది. ఇక ఈ వీధికవతల ఏముందో చూద్దాం'' అంటూ ముందుకు నడిచాడు హోమ్స్.

ఆ వీధి చివర్నుంచి మేము మలుపు తిరిగే సరికి అక్కడికి పూర్తి విరుద్ధంగా వున్న దృశ్యం దర్శనమిచ్చింది. అది చాలా రద్దీగా వున్న ప్రదేశం. నగరంలో ఉత్తర దక్షిణాలు కలిపే మెయిన్ రోడ్డు. వచ్చేపోయే వాహనాలతో కిటకిటలాడిపోతోంది. ఫుట్‌పాత్‌ల మీద జనం గబగబా నడుస్తున్నారు. అప్పుడే మేము వదిలివచ్చిన వీధి ఆ మెయిన్‌రోడ్డు వెనకాలే వుందంటే నమ్మబుద్ధి

కాలేదు.

హోమ్స్ అక్కడో మూల చూసుకు నిలబడ్డాడు.

"లండను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం నా హోబీ. ఈ రోడ్డు మీద ఏమేమున్నాయో గమనిద్దాం. అది మోర్టయిమరుగారి పొగాకు వ్యాపారం. అది న్యూస్ పేపరు షాపు. అదేమో సిటీ సబర్బన్ బ్యాంకువాళ్ళ కోబర్గు శాఖ. అది శాఖాహార భోజనశాల. ఇకపోతే అక్కడ మేక్ఫర్లేను గారి డిపోలో గుర్రబ్బళ్ళ తయారవుతాయన్న మాట. ఆ తర్వాతేమో అక్కడ్నించి అవతల బ్లాకు మొదలవుతుంది. డాక్టర్, ఇక్కడ మన పనైపోయింది. ఇక సంగీత సామ్రాజ్యంలో ప్రవేశిద్దాం. ముందో శ్యాండ్విచ్చు కతికి, కప్పు కాఫీ త్రాగి వయోలిన్ ప్రపంచంలోకి అడుగు పెడదాం. అక్కడ ఆనందమే ఆనందం. మనసుకు హాయిగా ప్రశాంతంగా వుంటుంది. ఎర్రజుట్టు క్లయింట్లెవరూ వచ్చి ఆ లోకంలో మనల్ని వేధించరు" నన్ను చెయ్యిపట్టి లాక్కుపోతూ అన్నాడు.

షెర్లాక్ హోమ్స్ సంగీతం ప్రియుడు మాత్రమే కాదు. స్వయంగా గొప్ప వయోలిన్ విద్వాంసుడు. ఆ మధ్యాహ్నమంతా అతను కచేరీలో సంగీతానికి అనుగుణంగా వేలివేళ్ళాడించుకుంటూ సంతోషంగా గడిపాడు. ఆ సమయంలో చిరునవ్వుతో నిండిపోయిన అతని మొహం, స్వప్నంలో తేలిపోతున్నట్టుగా వున్న అతని కళ్ళు చూస్తుంటే అతను నాకు తెలిసిన హోమ్సేనా అనిపించింది.

నేరస్తులకు సింహస్వప్నమైన హోమ్స్ అతను కాదు. తన అద్భుతమైన మేధస్సుతో కేసుల్ని చురుగ్గా, పరిష్కరించే హోమ్స్ అతను కాదు. తనకిష్టమైన సంగీతాన్ని వింటూ మైమర్చిపోయిన పసిపిల్లవాడు.

ఆ విచిత్రమైన ద్వంద్వ ప్రవృత్తి అతని వ్యక్తిత్వం లోనే దాగుంది. అతన్లో తరచుగా బయటపడే కవి హృదయానికి ఫలితమే ఆ మేధాశక్తి అనిపిస్తూ వుంటుంది నాకు. తన వ్యక్తిత్వంలోని ఆ వైవిధ్యమే అతన్ని ఆనందమయప్రపంచం నుంచి మేధా లోకం వైపు నడిపిస్తుంది. రోజుల తరబడి కుర్చీలో కూర్చొని తన సంగీత కృతుల్ని మెరుగులు దిద్దుకుంటూ వుండిపోయాక అపరాధ పరిశోధకుడిగా అతని శక్తి ఇనుమడిస్తుందనేది నాకు బాగా తెలిసిన సత్యం. సంగీతంలో ఓలలాడాక అతన్లోని వేటగాడు విజృంభిస్తాడు. అతన్లోని తార్కిక శక్తి కత్తిలా పదునెక్కుతుంది. అతని గురించి తెలియనివాళ్ళకు అతని మేధస్సు వింతగా తోస్తుంది. ఆ వేళ సెయింట్ జేమ్స్ హాల్లో మునిగితేలుతున్న హోమ్స్ని చూస్తుంటే ఎక్కడో ఏ నేరస్థుడికో మూడిందనిపించింది నాకు.

"నువ్వింటికి వెళ్తావా డాక్టర్?" అక్కడ్నించి బయటికి వచ్చేశాక అడిగాడతను.

"అవును, వెళ్దామనే అనుకుంటున్నాను."

"సరే, నేను పూర్తి చేయాల్సిన పనులు కొన్ని వున్నాయి. ఈ కోబర్గ్ స్క్వేరు వ్యవహారం చాలా సీరియస్‌గా వుంది."

"ఎందుకు సీరియస్?"

"చాలా పెద్ద నేరం ఒకటి జరగబోతోంది



ఇబ్బంది


"ఏమిట్రా గోపి! పరీక్ష రాయడం ఆపేసి ఆలోచిస్తూ కూర్చున్నావ్?"

"పెన్‌లో ఇంకు అయ్యిపోయింది సార్!"

"దానికి ఆలోచించేది ఏముంది! ఎవరి దగ్గరున్నా పెన్ తీసుకొని పరీక్ష రాయి."

"పెన్ నాకు ఇస్తే వాళ్ళకి ఇబ్బంది కదా సార్! అందుకే మీరు పర్మిషన్ ఇస్తే రాము నా పేపరు మీద రాసి ఇస్తాడు... అప్పుడు ఎవరికీ ఇబ్బంది వుండదు."

— *సాయిగంగాధర్ చామర్తి, విజయవాడ.*



డాక్టర్. మనం సకాలంలో ఆ నేరం జరక్కుండా ఆపాలి. ఈ రోజు శనివారం కావడం వల్ల పరిస్థితి విషమించిందనే చెప్పాలి. ఈ రాత్రికి నీ సాయం నాకవసరమవుతుంది.''

''ఎన్నింటికి?''

''పది దాటాక.''

''అయితే పదింటికి బేకర్ స్ట్రీట్లో నిన్ను కలుసుకుంటాను.''

''మంచిది. ముందే చెబుతున్నా డాక్టర్— ఇది ప్రమాదంతో కూడుకున్న వ్యవహారం. ఎందుకైనా మంచిది, నీ రివాల్వరు జేబులో వేసుకురా'' అంటూ నాకు చెయ్యూపి గిరుక్కున వెనక్కి తిరిగాడు.

ఆ తర్వాత కనురెప్పపాటులో జనంలో కలిసి అదృశ్యమైపోయాడతను.

నేను తెలివితక్కువ దద్దమ్మని కానని నా నమ్మకం.

అయితే షెర్లాక్ హోమ్స్ ముందు మాత్రం ఎందుకూ కొరగాకుండా పోతున్నానేమిటా అని పిస్తూ వుంటుంది. అతను విన్నదే నేనూ విన్నాను అతను చూసిందే నేనూ చూశాను. అయినా అతని మాటల్నిబట్టి చూస్తే జరిగిందేమిటో అతనికి పూర్తిగా అర్థం కావడం మాత్రమే కాదు, జరగబోయేది కూడా ముందు చూపుతో గ్రహించగలుగుతున్నాడని తెలుస్తోంది. నాకు మాత్రం అప్పటికీ ఆ వ్యవహారం అయోమయంగానే వుంది.

కెన్సింగ్టన్లో వున్న మా ఇల్లు చేరుకున్నాక ఓ చోట కుదురుగా కూచుని జరిగిందంతా ఒకసారి సింహావలోకనం చేసుకోసాగాను. జాబేజ్ విల్సన్ చెప్పిన విచిత్రమైన కథనీ, కోబర్గ్ స్క్వేరుకు వెళ్ళి మేము చూసిన విశేషాల్నీ, షెర్లాక్ హోమ్స్ వివరంగా చెప్పిన వింత పలుకుల్నీ అన్వయించుకుని వాటి అంతరార్థం గ్రహించడానికి ప్రయత్నించసాగాను.

అర్ధరాత్రిపూట బయల్దేరడం దేనికి? నన్ను రివాల్వర్తో రమ్మనడం దేనికి? ఎక్కడికి వెళ్ళాలి? ఏం చెయ్యాలి? షెర్లాక్ హోమ్స్ ఇచ్చిన సూచన గమనిస్తే విల్సన్ గారి బోడి మూతి గుమస్తా గుండెలు తీసిన బంటులా వున్నాడు. వాడేదో దొంగాట ఆడుతున్నాడు. ఎంత బుర్రబద్దలు కొట్టుకున్నా వాడు ఆడుతున్న దొంగాట ఏమిటనేది మాత్రం నాకు అర్థం కాలేదు. చీకటిపడితే అసలు రహస్యం దానంతటదే బయటపడిపోతుంది లెమ్మనుకొని ఆ సంగతలా వదిలేశాను.

నేను మళ్ళీ ఇంటి దగ్గర్నుంచి బయల్దేరేసరికి రాత్రి తొమ్మిదింబావైంది. పార్కు దాటి ఆక్స్ఫర్డ్ వీధిగుండా బేకర్ స్ట్రీటు చేరుకున్నాను. షెర్లాక్ హోమ్స్ ఇంటిముందు రెండు జట్కాబళ్ళు కనిపించాయి. నేను ఇంటి వడవాలోకి వెళ్తుండగా పై నుంచి కొన్ని గొంతులు వినిపించనారంభించాయి. లోపలికి వెళ్తూనే హోమ్స్ ఇద్దరు వ్యక్తుల్తో మాట్లాడుతుండడం కనిపించింది.

ఆ ఇద్దర్లో ఒకతన్ని నేను చూస్తూనే గుర్తుపట్టాను. అతని పేరే పీటర్ జోన్స్. పోలీసు అధికారి,. అతని వెంటవున్న రెండో మనిషెవరో నాకు తెలియలేదు. చూడ్డానికి సన్నగా పొడుగ్గా వున్నాడతను. ఏడుపు మొహం. తలకు తళతళా మెరిసిపోతున్న హ్యాటు పెట్టుకున్నాడు. అతి గౌరవప్రదంగా వున్న కోటు తొడుక్కున్నాడు.

''ఆహా, మనవాడు కూడా వచ్చేశాడు'', షర్టు గుండీలు పెట్టుకుంటూ అన్నాడు హోమ్స్. తర్వాత ఓ హంటరు చేతిలోకి తీసుకుని, ''వాట్సన్, వీరెవరో నీకు తెలుసుగా? మిస్టర్ జోన్స్— స్కాట్లండ్ యార్డు నుంచి వచ్చారు. ఇక వీరి పేరు మెర్రీ వెదర్. ఈ రాత్రి మనం జరపబోతున్న సాహసయాత్రలో తోడుగా వస్తాను'' అన్నాడు.

''చూశారా డాక్టర్, మనం జట్టుగా కలిసి వేటకు బయల్దేరే అవకాశం మళ్ళీ వచ్చింది,'' చెప్పాడు జోన్స్.

''మన మెర్రీవెదర్గారు కూడా దొంగల్ని పట్టడంలో ఉద్దండులే. ఎటూచ్చీ ఆయనకు మాలాంటి వేటకుక్కలు సాయం రావాలి,'' అన్నాడు.

''నాకేమో కొండను తవ్వి ఎలకని పడుతున్నామా అని భయంగా వుంది,'' నిరుత్సాహంగా అన్నాడు మెర్రీవెదర్.

''హోమ్స్ని మీరు హాయిగా నమ్మొచ్చులెండి. ఆయన పద్ధతులు ఆయనవి. ఎటొచ్చీ ఆయ నేం అనుకోనంటే అవి కొంచెం వాస్తవాతీతంగానే వుంటాయి. అయితే ఓ గొప్ప డిటెక్టివ్కు వుండాల్సిన లక్షణాలన్నీ ఆయనకున్నాయని చెప్పక తప్పదు. షోల్టో హత్యకేసులో ఒకసారీ, ఆగ్రా సంపద కేసులో ఇంకోసారీ ఆయన పోలీసుల్ని మించిపోయాడంటే అతిశయోక్తికాదు,'' అన్నాడు జోన్స్.

''మీరు చెబుతున్నారు కాబట్టి మీతో రావడానికి ఒప్పుకుంటున్నాను మిస్టర్ జోన్స్,'' మొహంలో ఫీలింగు కొద్దిగా మార్చుకుంటూ అన్నాడు మెర్రీవెదర్. ''ఏమైనా ఈ రాత్రి పేకాట మిస్సవుతున్నాను. ఇరవై ఏడేళ్ళ నుంచీ శనివారం రాత్రి పేకాట మిస్సవడం నాకిదే మొదటిసారి,'' అంటూ వాపోయాడు.


షెర్లాక్ హోమ్స్ నవ్వాడు.

''ఈ రాత్రి మీరెప్పుడూ గెలవనంత పెద్ద పందెం గెలవొచ్చు మిస్టర్ మెర్రీవెదర్. ఈ ఆట అంతకన్నా గొప్పగా వుంటుంది. మీరు గెలవబోతున్న పందెం ఎంతో తెలుసా? ముప్పైవేల పౌండ్లు. ఇకపోతే జోన్స్గారు కూడా ఎంతోకాలం నుంచీ పట్టాలనుకుంటున్న మనిషిని ఈ రాత్రి పట్టుకోవచ్చు,'' అన్నాడు.

''జాన్ క్లే,'' చెప్పాడు జోన్స్. ''దొంగ,

## రాహుల్ రాయ్ కి అవకాశాలు

'ఆషికి' చిత్రం తర్వాత రాహుల్ రాయ్ కి అవకాశాలు లేక ఆరునెల్లపాటు ఇంట్లో నే కూర్చుని గడిపాడు. అదేం చిత్రమోకాని ఆ తర్వాత రాహుల్ కి హఠాత్తుగా అవకాశాలు రావడం ప్రారంభమయ్యాయి. దాంతో ఊపిరాడనంత బిజీ అయిపోయాడు రాహుల్ రాయ్ . దాదాపు 30 సినిమాల్లో ఇప్పుడతను నటిస్తున్నాడు.



### వద్దన్నారండి

''ఏరా రామూ! ఆవుమీద వ్యాసం వ్రాయమని మొన్ననగా చెప్పాను. ఇంకా వ్రాయలేదా?'' కోపంగా అడిగాడు మాస్టారు.

''మా నాన్న గారు వ్రాయొద్దన్నారండి'' చెప్పాడు రాము.

'ఏం... ఎందుకు?' ప్రశ్నించారు మాస్టారు.

''ఆవుమీద వ్యాసం వ్రాస్తే పెన్ చెడిపోతుందట కదండి'' రాము సమాధానం విని ముక్కుమీద వేలు వేసుకున్నారు మాస్టారు.

— సాయిగంగాధర్ చామర్తి, విజయవాడ

# సెక్స్‌బాంబ్ మనీషా

మనీషాకోయిరాలా మొదటిసారిగా బొంబాయి వచ్చినప్పుడు తను కెమెరా ముందు అర్ధనగ్నంగా నటించనని కనపడ్డ పత్రికల వాళ్ళిందరితోనూ చెప్పింది.

సరే 'చాలా స్ట్రిక్ట్' అనుకున్నారంతా దాని కి తగ్గట్టుగా మొదటి సినిమాలో సంసార పక్షంల్లానే కనిపించింది కూడా. అయితే ఈ మధ్య తను నటిస్తున్న చిత్రాల్లో తను కూడా ఎవరికీ తీసిపోనన్నట్లు అందా లతో, ఒంపు సొంపులతో కనువిందు చే యడానికి నడుం బిగించింది. రానురాను ఆమె సెక్స్‌బాంబ్‌గా పేరు పొందిన ఆశ్చర్యపడనవసరం లేదు.




హంతకుడు, మోసగాడు, ఫోర్జరిస్టు. వయసులో చిన్నవాడైనా తన వృత్తిలో మాత్రం ఘనుడే. నేర స్తులకు నేరస్తుడు. వాడి గతం చెప్పుకోదగ్గదే. తాత రాజకుటుంబానికి చెందినవాడు. వీడు కూడా ఇటాన్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీల్లో చదువు వెలగబెట్టాడు. మహా చురుకైన బుర్ర వాడిది. ఎన్నిసార్లు ఆచూకీ పట్టినా తప్పించుకోగ లుగుతున్నాడు. ఈ రోజు స్కాట్లండ్లో దోపిడీ చేస్తాడు. రేపటికల్లా కారన్‌వాల్లో దొంగ చందాలు వసూలు చేస్తూ తిరుగుతుంటాడు. ఏళ్ళతరబడి గా వెంబడిస్తున్నా ఒక్కసారి కూడా నేను వాణ్ణి చూడ లేదు. ఎలా వుంటాడో గుర్తులు మాత్రం తెలుసు,'' అన్నాడు.

''ఈ రాత్రి వాడి పరిచయభాగ్యం మీక్కలు గుతుంది లెండి,'' చెప్పాడు షెర్లాక్‌హోమ్స్. ''ఈ జాన్ క్లేగాడితో అమీతుమీ తేల్చుకోవలసిన వ్యవహారాలు నాక్కూడా కొన్ని వున్నాయి. వాడి వృత్తిలో వాడు ఘనుడనే మాట నేనూ ఒప్పుకుం టాను. పది దాటింది. ఇక మనం బయల్దేరాం. ఓ జట్కాలో మీరిద్దరూ ముందు వెళ్ళండి. వెనకే నేనూ వాట్సన్ వస్తాం,'' అన్నాడు.

ఆ సుదీర్ఘమైన ప్రయాణంలో షెర్లాక్‌హో మ్స్ నాతో మాట్లాడింది పెద్దగా ఏంలేదు. ఆ మధ్యాహ్నం విన్న సంగీత స్వరాలే కూనిరాగాలు తీసుకుంటూ ఎక్కువసేపు గడిపేశాడు. కిరస నాయిలు దీపాల్తో మిలమిలా మెరుస్తున్న వీధులు ఒక్కొక్కటీ దాటుకుంటూ చివరికి మేము ఫారింగ్టన్ వీధి చేరుకున్నాం.

''దగ్గరకొచ్చేశాం,'' చెప్పాడు హోమ్స్. ''ఈ మెర్రీవెదర్ అనేవాడో బ్యాంకు డైరెక్టరు. ఈ వ్యవహారంలో అతనికి పర్సనల్ ఇంట్రెస్టుంది. జోన్స్ కూడా మనతోపాటే వస్తే బావుంటుంద ని అతన్ని కూడా పిలిచాను. వృత్తిరీత్యా గాడిదైనా మంచివాడు పాపం. వేటకుక్కలాంటి తెగింపే అతన్లో వున్న సుగుణం. ఎవరిమీదికి దూకడాని కైనా జంకడు. అదిగో, వచ్చేశాం. వాళ్ళు మన కోసం ఎదురు చూస్తున్నారు,'' అంటూ జట్కాబండి ఆపాడు.

ఆ ఉదయం మేము చూసిన రద్దీ ప్రదేశానికే మళ్ళీ వచ్చాం. ముగ్గురం కలిసి మెర్రీవెదర్ వెంట నడిచాం. ఓ చిన్న సందులోకి వెళ్ళి పక్క తలుపు గుండా ఓ బిల్డింగులోకి ప్రవేశించాం. లోపల చిన్న నడవాకవతల బ్రహ్మాండమైన ఇనపగేటు కనిపిం చింది.

మెర్రీవెదర్ ఆ గేటు తెరచి రాతిమెట్ల వెంబ డి మమ్మల్ని కిందికి తీసుకువెళ్ళాడు. ఎదురుగానే మరో బలమైన గేటుంది. మెర్రీవెదర్ అక్కడాగి లాంతరు వెలిగించాడు. తర్వాత ఆ గేటు కూడా తెరచి చీకటిగా వున్న మరో నడవాలోకి తీసుకెళ్ళా డు. ఆ లోపల మట్టివాసన వేస్తోంది. అక్కడ ఇంకో గేటు కనిపించింది. మెర్రీవెదర్ ఆ మూడో గేటు కూడా తెరచి మమ్మల్ని ఓ పెద్ద భూగృహంలోంకి తీసుకెళ్ళాడు. ఆ భూగృహ మంతా పెద్ద పెద్ద పెట్టెల్తో నిండిపోయింది. వాటిలో కొన్ని ఇనప్పెట్టెలు. మిగతావి కొయ్య పెట్టెలు.

''పై నుంచి దిగిరావాలంటే ఈ ప్రదేశం దుర్భేద్యంగానే వుంది,'' లాంతరు పైకెత్తి ఆ వెలుతుర్లో మెర్రీవెదర్ మొహంలోకి చూస్తూ వ్యాఖ్యానించాడు హోమ్స్.

''కింది నుంచి కూడా దుర్భేద్యమే,'' అంటూ చేతికర్రతో నేలమీద కొట్టాడు మెర్రీ వెదర్. వెంటనే ఆశ్చర్యంతో తల పైకెత్తాడు. ''ఇదేమిటి, ఇక్కడంతా బోలుగా వున్నట్టు శబ్దం వస్తోంది?'' అన్నాడు

''షటప్,'' కోపంగా అన్నాడు హోమ్స్. ''ఆ కర్రతో నేల మీద కొట్టి వచ్చినపని నాశనం చేయబోయారు. మా పనిలో జోక్యం చేసు కోకుండా దయచేసి ఆ పెట్టెమీద కూర్చోండి,'' అంటూ కసిరాడు.

మెర్రీవెదర్ మొహం నిండా గంటు పెట్టుకు ని ఓ పెట్టెమీద కూర్చున్నాడు. హోమ్స్ మోకా ళ్ళమీద కూలబడి జేబులోంచి ఓ భూతద్దం బయ టకి తీశాడు. నేలమీద పరిచిన రాతిపలకల మధ్య సందుల్ని లాంతరు వెలుతుర్లో ఆ భూతద్దంతో పరీక్షించసాగాడు. కొద్ది క్షణాల్లోనే తృప్తిపడి చెం గున లేచి నిలబడిపోతూ భూతద్దం మళ్ళీ జేబులో పడేసుకున్నాడు.

''మనకింకా కనీసం గంటసేపైనా వ్యవధి వుంధి. జాబేజ్ విల్సన్ క్షేమంగా పడకేసే దాకా వాళ్ళేం చేయలేరు. ఆ తర్వాత మాత్రం ఒక్క నిమిషం కూడా వృధా చేయరు. ఎంత త్వరగా పని పూర్తి చేయగలుగుతారో పారిపోవడానికి అంత ఎక్కువ సమయం వాళ్ళకు దొరుకుతుంది,'' అంటూ నావైపు తిరిగాడు.

''ప్రస్తుతం మనం సిటీలోని ఓ ప్రధాన బ్యాంకు వాల్టులో వున్నాం డాక్టర్. మెర్రీవెదర్ ఆ బ్యాంకు డైరెక్టర్లకు అధ్యక్షుడు. ప్రస్తుతం లండ న్లోని దొంగలంతా ఈ భూగృహం మీదే కన్నేసి వుంచడానికి కారణం ఏమిటో ఆయనే చెబు తాడు,'' అన్నాడు.

''ఇదంతా మా ఫ్రెంచి బంగారం వల్ల వచ్చి పడ్డ గొడవ,'' గుసగుసగా అన్నాడు మెర్రీవెదర్. ''ఆ బంగారాన్ని దోచుకునే ప్రయత్నాలు జర గొచ్చని మాకు హెచ్చరికలు అందాయి.''

''ఫ్రెంచి బంగారమా?''

(ముగింపు వచ్చేవారం)


## సేవ

''ప్రజాసేవయే మా లక్ష్యం. దానికి మీ సహకారం కావాలి'' కండక్టర్ తన ధోరిన చెప్పుకు పోతుండగా...

''ఇంతకీ ఏం చెయ్యాలయ్యా?'' బస్సులో ఓ ప్రయాణీకుడు అరిచాడు.

''ఏమీ లేదు బస్ చెడిపోయింది. ఓ అరమైలు వరకూ అందరూ కలిసి బస్సు నెంటాలి'' తాపీగా చెప్పాడు డ్రైవర్.

— యేలూరి శ్రీనివాస్.



సర్ ఆర్థర్ కానన్ డాయల్

# ఎర్ర తలకాయల సంఘం

## దాదా హయాత్

(గత సంచిక తరువాయి)

"అవును. కొద్దినెల్ల క్రితం మా ఆర్థికవనరులు పెంచుకోడానికి బ్యాంకాఫ్ ఫ్రాన్స్‌నుంచి ముప్ఫైవేల బంగారు నాణాలు అప్పుగా తెచ్చుకున్నాం. ఆ బంగారం పెట్టెలు ఇంకా మేము తెరవలేదు. అవిక్కడ భూగృహంలోనే షదున్నాయనే విషయం ఎలాగో బయటికి పొక్కింది. నేనిప్పుడు కూర్చున్న పెట్టెలోపల రెండువేల బంగారు నాణాలు సే సంపొదల్లో భద్రంగా వున్నాయి. మామూలుగా ఒక బ్రాంచిలో నిలవుండాల్సిన మిలియన్‌కంటే ఎక్కువే వుందిక్కడ. అందువల్ల మా డైరెక్టర్లు కూడా చాలా భయాలు వ్యక్తం చేస్తున్నారు."

"వాళ్ళ భయాలు అర్థం లేనివేం కావు," చెప్పాడు హోమ్స్. "ఇప్పుడు మనం చేయవలసిందేమిటో జాగ్రత్తగా ఆలోచించుకోవాలి. ఈ వ్యవహారం మరో గంటలో తేలిపోతుందనుకుంటాను. ఆలోగా మనం ఈ లాంతరు వెలుతురు బయటికి రాకుండా చేయాలి," అన్నాడు.

"అయితే చీకట్లో కూర్చోవలసిందేనా?" అన్నాడు మెర్రీవెదర్.

"తప్పదు. మీ పేకాట తప్పిపోకూడదని నేనో పేక జేబులో వేసుకొచ్చాను. అయితే శత్రువుల ఏర్పాట్లు చాలా దూరం వెళ్ళాయి కాబట్టి మనం వెలుతుర్లో కూచుని కులాసాగా పేకాట ఆడుకోలేం. మొదట మనం పొజిషన్లు చూసుకుందాం. వీళ్ళు తెగించిన మనుషులు. మన గురించి ఎంత ఏమరపాటులో వున్నా మనం జాగ్రత్తపడకపోతే ఖచ్చితంగా దెబ్బతీస్తారు. నేనీ పెట్టె చాటున నిలబడతాను. మీరంతా వాటి వెనక దాక్కోండి. వెలుతురొచ్చిన వెంటనే వెళ్ళి వాళ్ళ మీద పడండి. వాట్సన్, వాళ్ళు పిస్తోలు పేలిస్తే నువ్వు షూట్ చేయడానికి ఏమాత్రం జంకొద్దు," అన్నాడు షెర్లాక్‌హోమ్స్.

నేను రివాల్వరు సిద్ధంగా వుంచి ఓ కొయ్య పెట్టె వెనక దాక్కున్నాను. హోమ్స్ లాంతరు మీదున్న రేకు దించేయడంతో మా చుట్టూ కటిక చీకటి వ్యాపించింది. అలాంటి చీకటి నేనెప్పుడూ అనుభవించి ఎరుగను. లాంతరు చుట్టూ వున్న రేకు వేడెక్కడంతో ఒక విధమైన వాసన ముక్కుపుటలకు సోకుతోంది. ఆ వాసన్ని బట్టి రేకులోపల లాంతరు వెలుగుతూనే వుందని తెలుస్తోంది. ఏక్షణంలోనైనా లాంతరు వెలుతురు మళ్ళీ ఆ భూగృహంలో వ్యాపించవచ్చు. ఏం జరగబోతోందో తెలీక నా నరాలు పురెక్కిపోతున్నాయి. చీకట్లో ఆ భూగృహంలోపల చల్లగా తేమగా వున్న గాలివల్ల కడుపులో ఒక విధమైన ఖాళీ ఏర్పడుతున్న భావం కలుగుతోంది.

"పారిపోవాలంటే వాళ్ళకు ఒకటే దారి," లోగొంతుకలో చెప్పాడు హోమ్స్. "విల్సన్ ఇంట్లోంచి చల్లగా కోబర్గ్ స్క్వేర్లోకి జారుకోవడం. జోన్స్, మీరు నేను చెప్పిన పని చేశారా?" అడిగాడు.

"ఓ ఇన్స్‌పెక్టర్నీ, ఇద్దరు కానిస్టేబుళ్ళనీ విల్సన్ ఇంటిముందు కాపలా వుంచాను," చెప్పాడు జోన్స్.

"అయితే వాళ్ళకున్న దారులన్నీ మూసుకుపోయినట్టే. ఇక నిశ్శబ్దంగా వుండి కాచుకుందాం."

క్షణం ఒక యుగంగా గడుస్తోంది. నిజానికి మేమక్కడ గంటంబావుకంటే ఎక్కువ కాచుకోలేదు. అయినా ఆ సమయంలో మాత్రం రాత్రంతా అలాగే గడిచిపోయి బయట తెల్లారిపోయి వుంటుందనే అనిపించింది. ఉన్న చోటునుంచి ఏమాత్రం కదలడానికి సాహసించలేక పోయాను. కాళ్ళూ చేతులూ బిగుసుకుపోతున్నాయ్. టెన్షన్ మూలంగా నరాలు తీపులు పెడుతున్నాయ్. చెవులెంత పదునెక్కిపోయాయంటే నాతోటి వాళ్ళు వూపిరి పీలుస్తున్న శబ్దాలు వినగలగడం

మాత్రమే కాదు, వాటిలో ఏ శబ్దం ఎవరిదో కూడా అర్థం చేసుకోగలుగుతున్నాను. బరువుగా వూపిరి పీలుస్తున్న శబ్దం బ్యాంకు డైరెక్టర్‌ది. నేను దాక్కున్న కొయ్యపెట్టె మీదనుంచి అవతలిపక్క నేల కనిపిస్తుంది. అకస్మాత్తుగా నా కళ్ళకు నేలమీద ఏదో సన్నని వెలుతురు పుట్టుకొస్తున్న అనుభూతి కలిగింది.

మొదట ఏదో మిణుగురుపురుగులా తోచిన ఆ వెలుతురు క్రమంగా పొడుగ్గా సాగింది. ఉన్నట్టుండి ఎలాంటి హెచ్చరిక లేకుండా నేల కొంత మేరకు నిశ్శబ్దంగా విచ్చుకుంటున్నట్టు తోచింది. ఆ వెలుతురు మధ్య ఓ చెయ్యి ప్రత్యక్షమైంది.

తెల్లగా దాదాపు ఆడపిల్ల చేతిలా వుందది. కాసేపు ఆ చేతివేళ్ళు అల్లాడాయి. తర్వాత నెమ్మదిగా ఆ చెయ్యి నేలలోంచి ఇంకా పైకి పొడుచుకొచ్చింది. అంతలోకే ఎలా వచ్చిందో అలాగే మళ్ళీ నేలలోకి అదృశ్యమైపోయింది. భూగృహంలో తిరిగి చీకటి వ్యాపించింది. మొదట నేలమీద సన్నని రవ్వలా కనిపించిన వెలుగురేఖ మళ్ళీ ప్రత్యక్షం కావడం తప్ప మరింకేం గోచరించడంలేదు.

ఆ చెయ్యి అదృశ్యం కావడం లిప్త పాటు మాత్రమే.

చూస్తుండగానే చెవులు గింగురుమనిపించే ప్రతిధ్వనుల్తో నేలమీద ఓ రాతి పలకలేచి పక్కన పడిపోయింది. దాంతోపాటే భూమిలోపల ఓ సొరంగమార్గం తెరుచుకుంది.

ఆ సొరంగమార్గంలో నుంచే లాంతరు వెలుతురు బయటికి ప్రసరిస్తోంది. అందులోంచి నున్నగా చిన్న పిల్లాడికిమల్లే కనిపిస్తున్న మొహం ఒకటి నెమ్మదిగా పైకొచ్చి ఆసక్తిగా చుట్టూ ఓసారి పరికించి చూసింది. తర్వాత సొరంగంలోంచి రెండు చేతులూ బయటపెట్టి ఆ ఆకారం నడుం వరకూ పైకిలేస్తూ ఓ మోకాలుపై అంచుమీదా నిలిచింది. ఆ మరక్షణం ఆ ఆకారం పొంతంగా సొరంగంలోంచి బయటికొచ్చేస్తూ బిలమార్గం పక్కన నిలబడిపోయింది. ఆ ఆకారం వెనకే మరో వ్యక్తి కూడా పైకి రావడానికి ప్రయత్నిస్తున్నాడు. సన్నగా కురచగా వున్నాడతను. పాలిపోయినట్టుగా వున్న తెల్లని మొహం. తల వెంట్రుకలు చాలా ఎర్రగా వున్నాయి.



"అంతా క్లియర్‌గా వుంది. ఉలుగూ, సంచులూ తెచ్చావా? త్వరగా పైకిరా. ఈ పెట్టెలు నేను తెరుస్తాను," అన్నాడు ముందుగా పైకొచ్చినతను. అతను మరెవరో కాదు, జాబేజ్ విల్సన్‌గారి గుమస్తా విన్సెంట్ స్పాల్డింగ్— ఉరఫ్, జాన్ క్లే.

షెర్లాక్‌హోమ్స్ సింహంలా ముందుకు దూకి అతని కాలరు దొరకబుచ్చుకున్నాడు. రెండోవాడు అది చూస్తూనే సొరంగంలోకి జర్రున జారుకోబోయాడు. అదే సమయంలో జోన్స్ అతన్ని జారిపోనివ్వకుండా చొక్కా పట్టుకునేసరికి అదికాస్తా పర్రున చిరిగి ఓ ముక్క చేతికొచ్చింది. లాంతరు వెలుతుర్లో ఓ రివాల్వర్ బారెల్ తళుక్కున మెరిసింది. అయితే అంతలోకే హోమ్స్ చేతిలోని హంటరు ఝళ్ళున తాకడంతో ఆ రివాల్వరు కాస్తా ఖంగుమంటూ నేలమీద పడిపోయింది.

"లాభంలేదు జాన్ క్లే నువ్వింక తప్పించుకోలేవు," సౌమ్యంగా అన్నాడు హోమ్స్.

"కనిపిస్తూనే వుంది," అతను కూడా తత్తరపడకుండా చల్లగా అన్నాడు. "కనీసం నా స్నేహితుడైనా క్షేమంగా తప్పించుకున్నాడనుకుంటాను. అతని చొక్కా మాత్రం చిరిగి మీ చేతికి వచ్చినట్టుంది."

"అవల తలుపు దగ్గర అతని కోసం ముగ్గురు ఆఫీసర్లు ఎదురు చూస్తున్నారు," చెప్పాడు హోమ్స్.

"ఓహ్, నిజంగానా? అయితే చక్కని పథకం వేశారన్న మాట! మిమ్మల్ని అభినందించాల్సిందే."

"నిన్నూ అభినందించాల్సిందే జాన్ క్లే. నీ ఎర్రతలకాయల అయిడియా కొత్తగా, పకడ్బందీగా వుంది," అన్నాడు హోమ్స్.

"కాసేపట్లో నీ స్నేహితుణ్ణి చూడొచ్చులే," చెప్పాడు జోన్స్. "నేను పట్టుకునే లోపలే సొరంగంలోకి జారిపోయాడు వెధవ. హోమ్స్, ఒక్కక్షణం వీణ్ణి కదలకుండా పట్టుకోండి. కంకణాలు తొడిగిద్దాం," అన్నాడు.

"మీ ఫండాలపు చేతుల్తో దయచేసి నన్ను తాకొద్దు," జోన్స్ తనకు సంకెళ్ళు వేస్తుండగా అన్నాడు జాన్ క్లే. "నా నరాల్లో వున్నది రాచనెత్తు

రని బహుశా మీకు తెలియకపోవచ్చు. నన్ను అయ్య గారూ అని పిలవండి.''

''అలాగే నండయ్యగారూ! దయచేసి తమరు మెట్లమైపు కదుల్తారా? ప్రభువులవారిని పోలీస్ స్టేషనుకు తీసుకెళ్ళడానికి రథం సిద్ధంగా వుంది,'' వెటకారంగా అన్నాడు జోన్స్.

''అలా అన్నారు, బావుంది,'' దర్పంగా మా ముగ్గురికీ అభివాదం చేసి జోన్స్ వెంట వెళ్ళిపోయాడు జాన్ క్లే.

''మా బ్యాంకు తరఫున మీకెలా కృతజ్ఞతలు తెలుపు కోవాలో తెలియడం లేదు మిస్టర్ హోమ్స్,'' వాళ్ళిద్దరి వెనకే మేమూ ఆ భూగృహంలోంచి బయటపడుతుండగా అన్నాడు మెర్రీ వెదర్. ''పకడ్బందీగా బ్యాంకు దోచుకోవడానికి పూనుకున్నవాళ్ళని కనిపెట్టి పట్టుకున్నాను. ఇలాంటి దోపిడీ దొంగల్ని నా అనుభవంలో ఎప్పుడూ చూడలేదు. నిజంగా మీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావడం లేదు.''

''జాన్ క్లేతో నాకూ పాతవైరాలు కొన్ని వున్నాయిలెండి,'' చెప్పాడు హోమ్స్. ''అయితే ఈ వ్యవహారంలో నా చేతి డబ్బు కొంత ఖర్చయింది. అది మీ బ్యాంకే తీర్చాలి. ''ఏది ఏమైనా అన్నింటినీ మించి ఈ కేసులో దొరికిన సరికొత్త అనుభవం వల్ల నా కష్టానికి తగ్గ ఫలితం దొరికిందనే చెప్పాలి. ఎర్రతలకాయల సంఘం కథ నన్ను చాల అలరించింది,'' అన్నాడు.

★★★★★★

ఆ తెల్లారు జామున మేమిద్దరం బేకర్ స్ట్రీటు లో విస్కీ సోడా కలిపిన గ్లాసు చెరొకటి పట్టుక్కూచున్నాం.


''యూ సీ వాట్సన్, ఈ విచిత్రమైన కేసులో నాకు మొట్టమొదట స్ఫురించిందొకటే. ఎర్రతలకాయల సంఘం పెట్టి జాబేజ్ విల్సన్ చేత ఎన్సైక్లోపేడియా కాపీ చేయించడం దేనికి? రోజూ కొంతసేపు అతన్ని ఇంట్లో లేకుండా చేయడం తప్ప నాకు వేరే లాభం కనిపించలేదు. దానికోసం వాళ్ళు అనుసరించిన విధానం విపరీతంగానే వుందొచ్చు. అయితే అంతకంటే మంచి పద్ధతి మరొకటి సూచించడం కష్టం. తప్పకుండా అది జాన్ క్లే తెలివైన బుర్రలో మొలిచిన ఆలోచనే. తన స్నేహితుడి జుట్టు ఎర్రగా వుండడం అతనికి బాగా వుపకరించింది. బయటి ప్రపంచంలో ఏం జరిగినా విల్సన్ ఇంట్లోంచి కదలడు. అలాంటి ఘటాన్ని రోజూ కొద్ది గంటలసేపు బయటికి లాగాలంటే వారానికి నాలుగు పౌండ్లు ఎర చూపించాల్సి వచ్చింది. వేలకొద్దీ డబ్బు దోచుకోవడానికి పథకం వేసిన వాళ్ళకు అదో పెద్ద మొత్తం కాదు. అందుకే వాళ్ళు పేపర్లో ప్రకటన వేశారు. ఓ దొంగ తాత్కాలికంగా ఓ ఆఫీసు ఏర్పాటు చేసుకుంటే రెండో దొంగ విల్సన్‌ని మారించడానికి అతనింట్లో చేరాడు. ఇద్దరూ కలిసి అతన్ని ఇంట్లో లేకుండా చేసి ఆ సమయాన్ని ఆ ఇంట్లోంచి బ్యాంకులోకి సొరంగం తవ్వడానికి వినియోగించారు. విల్సన్ గుమస్తాసగం జీతానికే పనికి కుదిరాడని విన్న క్షణం నుంచే నాకు అతని మీద అనుమానం వచ్చింది. విల్సన్ దగ్గర పనికి కుదరడానికి అతనికేదో ప్రత్యేకమైన కారణం వుండాలని పించింది,'' చెప్పాడు హోమ్స్.

''కానీ, అతను సొరంగం తవ్వడానికే అక్కడ చేరాడని నువ్వెలా వూహించగలిగావ్?'' అడిగాను.

''ఆ ఇంట్లో ఆడవాళ్ళెవరైనా వుంటే వాడక్కడేదో నీచమైన ఉద్దేశంతో చేరాడనుకునేందుకు అవకాశం వుంది. అయితే ఇక్కడ ఆ ప్రశ్నే లేదు. పోతే విల్సన్‌గారి వ్యాపారం చాలా చిన్నది. అంత పెద్ద పథకం వేయడానికి ఆ ఇంట్లో వున్నదేం లేదు. కాబట్టి వాళ్ళకు కావల్సిందేదో ఆ ఇంట్లో లేదు. అదేమై వుంటుంది? ఆ గుమస్తాకు ఫోటో గ్రాఫుల పిచ్చి వుందని విల్సన్ చెప్పాడు. ఫోటోలు డెవలప్ చేస్తానంటూ అతను నేల మాళిగలోకి దూరి కూర్చుంటున్నాడు. నేల మాళిగ అవగానే నాకేదో స్ఫురించినట్టయ్యింది. అప్పుడే తన గుమస్తా ఎలా వుంటాడో చెప్పమని విల్సన్‌ని అడిగాను. అతను వర్ణించి చెప్పగానే వాడు జాన్ క్లే అయివుంటాడని తెలిసిపోయింది. జాన్ క్లేని నా కళ్ళతో ఎప్పుడూ చూడకపోయినా వాడి గుర్తులు తెలుసు. దాంతో నేను ఎదుర్కోబోతున్నది లండన్లో అందరికంటే తెలివైన నేరస్తుడినని అర్థమైపోయింది. ఆ నేల మాళిగలో దూరి వాడేదో చేస్తున్నాడు. రోజూ కొన్ని గంటల తరబడి పని చేస్తే అది పూర్తికావడానికి రెండు నెలలు పట్టిందన్నమాట. అలాంటి పని ఏమై వుంటుంది? ఆ ఇంట్లోంచి మరో ఇంట్లోకి సొరంగం తవ్వడం తప్పిస్తే నాకు మరో కారణం స్ఫురించలేదు.

''కోబర్గ్ స్క్వేర్లో జాబేజ్ విల్సన్ ఇల్లు చూడ్డానికి మనం వెళ్ళేటప్పటికి అంతమటుకు నేనర్థం చేసుకోగలిగాను. ఇక అక్కడికి వెళ్ళాక పేవ్‌మెంటుని నేను చేతి కర్రతో కొట్టడం చూసి నువ్వాశ్చర్యపోయావు గుర్తుందా? నేల మాళిగలోంచి వాడు తవ్విన సొరంగం ఆ ఇంటి ముందరకుందో వెనక్కుందో తెలుసుకోవడానికే నేనలా చేశాను. అక్కడ బోలుగా శబ్దం రాలేదు కాబట్టి సొరంగం ఆ ఇంటి ముందుకు లేదని తేలిపోయింది. కాబట్టి ఆ ఇంటి వెనక్కి సొరంగం తవ్వాడన్నమాట. తర్వాత నేనా ఇంటి తలుపు తట్టాను. ఆ వచ్చేవాడు విల్సన్‌గారి గుమస్తా కావాలని ఆశించాను. అదృష్టవశాత్తూ అతనే బయటికొచ్చాడు. గతంలో మా ఇద్దరి మధ్యా వైరాలున్నా మేమెప్పుడూ ఒకర్నొకరం చూసుకున్న పాపాన పోలేదు. ఆ సమయంలో కూడా నేనతని మొహంవంక సరిగ్గా చూడలేదు. నేను చూడాలనుకున్నది అతని మోకాళ్ళని. మోకాళ్ళ దగ్గర అతని పాంటు ఎలా వెలిసిపోయి మరకలు పడిందో నువ్వూ గమనించే వుంటావు. సొరంగం తవ్వుతున్నప్పుడు ఎక్కువగా మోకాళ్ళమీద కూర్చోవలసి రావడం వల్ల పడ్డ గుర్తులవి. ఇక తేలాల్సిన విషయం వాళ్ళెందుకు సొరంగం తవ్వుతున్నారనేది. అప్పుడే నిన్ను ఆ ఇంటికవతల ఏముందో చూడ్డానికి మెయిన్ రోడ్డు మీదికి తీసుకెళ్ళాను. సిటీ– సబర్బన్ బ్యాంకు ఆ ఇంటి పరిసరాలకు ఆనుకునే వుండడం కనిపించింది. దాంతో నా పరిశోధన పూర్తయిపోయింది. సంగీత కచేరీ తర్వాత నువ్వింటికెళ్ళావు. నేను స్కాట్లండ్ యార్డుకెళ్ళాను.

తర్వాత ఆ బ్యాంకు డైరెక్టర్ల చైర్మన్‌ని కలుసుకున్నాను. ఆ తర్వాతేం జరిగిందో నీకు తెలుసు.''





## జాకీ వెంట పూజాభట్

పూజాభట్ జాకీష్రాఫ్ వెంట పడ్తోందని అందరూ అనుకుంటున్నారు. లేకపోతే 'అంగార్' చిత్రం కోసం డబ్బింగ్ చెబుతున్న జాకీష్రాఫ్‌ను అంటి పెట్టుకునే రాత్రంతా ఉండాల్సిన అవసరం పూజాభట్‌కి ఏమిటి? డబ్బింగ్ ఎలా చెప్పాలో జాకీకి పాఠాలు నేర్పుతోందా? అనడుగుతున్నారు. ఆ రాత్రి ఈ ఇద్దర్నీ చూసినవాళ్ళు.

''వాళ్ళు ఈ రాత్రికే బ్యాంకులో పడతారని నీకెలా తెలుసు?'' అడిగాను.

''వాళ్ళు ఎర్రతలకాయల సంఘం ఎత్తేశారంటే విల్సన్‌ని ఇంటి నుంచి తప్పించాల్సిన అవసరం మరింక లేదనే అర్థం. మరో విధంగా చెప్పాలంటే వాళ్ళు సొరంగం తవ్వడం పూర్తి చేశారన్న మాట. ఇక వాళ్ళు త్వరగా తమ పని ముగించుకోకపోతే సొరంగ రహస్యం బయటపడే ప్రమాదం వుంది. లేదంటే బ్యాంకు వాళ్ళు బంగారం వేరే చోటికి తరలించే అవకాశం కూడా వుంది. దొంగతనానికి శనివారంవాడు పూనుకుంటే పారిపోవడానికి ఆదివారం కూడా కలిసొస్తుంది. ఈ కారణాలన్నింటివల్లా వాళ్ళు ఈ రాత్రికే బ్యాంకులో పడతారని వూహించగలిగాను.''

''నీ తర్కం చాలా బావుంది. అంత పెద్ద గొలుసులో ప్రతి లింకూ సరిగ్గా వేయగలిగావు,'' ప్రశంసించకుండా వుండలేకపోయాను.

''ఇలాంటి కేసులు నన్ను బద్ధకం నుంచి కాపాడతాయి,'' అంటూ గట్టిగా ఓసారి ఆవులించాడతను. ''చూశావా, నాకు మళ్ళీ బద్ధకం వచ్చేస్తోంది. రొటీనుగా కాలం వెళ్ళబుచ్చాలంటే నాకు మహా విసుగు. ఆ విసుగుదల నుంచి తప్పించుకునే ప్రయత్నంలోనే నా జీవితమంతా గడిచిపోతోంది. ఇలాంటి బుల్లి సమస్యలు ఆ ప్రయత్నంలో నాకు సాయపడుతుంటాయి,'' అన్నాడు.

''దాని వల్ల మానవ జాతికి మేలే జరుగుతోంది,'' అన్నాను.

హోమ్స్ భుజాలెగరేసి, ''మానవ సేవే మాధవ సేవ,'' అన్నాడు నవ్వుతూ.

— వచ్చేవారం మరో డిటెక్టివ్ కథ

# జగమంతా వింతలమయం

## 'కుక్క'గారి ఆదాయం రోజుకు 'లక్ష'

విశ్వాసానికి మారుపేరుగా కుక్కను చెప్పుకొంటాం. ఆ విషయంలో మనుషులు కూడా కుక్కజాతితో సరిపోరు. అమెరికన్లకు కుక్కలంటే మహాప్రాణం. వాటిని తమ కన్నపిల్లలకంటే ఎక్కువ శ్రద్ధతో పోషించుకొంటారు. మోడలింగ్ వృత్తిలో క్రీడాకారులు, నటీనటులు లక్షల కొద్దీ సొమ్మును సంపాదిస్తారని వింటుంటాం. ఇప్పుడు ఆ రంగంలోకి ఒక కుక్కగారు ప్రవేశించి ఎవరూ ఊహించనంత సొమ్మును సంపాదిస్తోందట. లండన్ దేశానికి చెందిన ''ఫిపిన్'' అనే పేరుగల కుక్క మోడలింగ్‌కు ఫోజులిచ్చి రోజుకు 'లక్ష' రూపాయలు వసూలు చేస్తోందట. సదరు కుక్కశ్రీ నటన కూడా నేర్చుకొంటే ఇక వెండితెరమీద మరో హీరో కనిపించచ్చేమో!

## సముద్ర గర్భంలో 'రాత్రిక్లబ్బు'

రకరకాల రాత్రి క్లబ్బులను చూస్తుంటాం. కానీ సముద్ర గర్భంలో క్లబ్బు అంటే నమ్మబుద్ధి కాదు. కానీ అది ఇప్పటికే ప్రజాదరణతో నడపబడుతున్నదట. ఇజ్రాయిల్ దేశంలో, 'సైబీరియన్' నగరంలో ఉన్న 'గెలీలియో' అనే సముద్ర ప్రాంతంలో ఒక నైట్ క్లబ్బు వుంది. అది సముద్ర గర్భంలో 676 అడుగుల అడుగున ఉందట. దాని పేరు 'మైనస్ 206' విచిత్రంగా వుంది కదూ! అందుకే ప్రపంచ వింతగా చెప్పుకొనబడుతోంది మరి.

## బడా 'చీట్'

ఈ కలికాలంలో మోసం చెయ్యటం ఒక వృత్తిలా సాగిస్తున్న మహానుభావులెంత మందో వున్నారు. ఉద్యోగాలిప్పిస్తామంటూ, ప్లాట్లు అమ్మడానికి చూపిస్తామంటూ... ఇలా రకరకాలుగా ఎదుటి వాళ్ళను బుట్టలో పడేసి వేలకువేలు లాగేస్తుంటారు. ఆశ, అవసరం మనిషిని అలా మోసపొయ్యేందుకు దోహదమవుతుందేమోనని అనిపిస్తుంటుంది. ఇలాంటి చిన్న చిన్నవి కాకుండా, అమెరికా అధ్యక్షుడు నివసించే ''వైట్ హౌస్''నే ఎరగా పెట్టి లక్షడాలర్లు కొట్టేసిన ప్రభుద్ధుడి గురించి వింటే 'అమ్మో' అని అనక మానరు. 'ఫర్గూసన్' అనే బడా చీట్, ఒక అమెరికా వ్యాపారస్థుడిని కలిసి, అమెరికా ప్రభుత్వం, వైట్ హౌస్‌ని వదిలేసి, మరొక కొత్త భవనాన్ని నిర్మించటానికి తలపెట్టిందని చెప్పి, నమ్మించి తనే ప్రభుత్వాధికారిలా తొంభై తొమ్మిది సంవత్సరాలకు లీజుకి ఇచ్చేశాడట. అంతేగాక లీజు నిమిత్తం మొదట సంవత్సరం చెల్లించవల్సిన 100,000 డాలర్లు ఫర్గూసన్ వసూలు చేశాడట. ఆ తరువాత ఆ వ్యాపారస్థుడు వైట్‌హౌస్‌ని పెద్ద హోటల్‌గా మార్చే ప్రయత్నంలో తను మోసపోయిన విషయం తెలుసుకొన్నాడట! ఆ ఫర్గూసన్ సోదరులు లాంటి బడాశే(చీ)ట్‌ల పేర్లు ఈ మధ్య షేర్ల విషయంలో మనం వింటున్నాం. ఇవన్నీ చూస్తుంటే ఒక కార్లో, సైకిలో అమ్మేసినట్లుగా ఒక దేశాన్ని, ఇంకో దేశానికి అమ్మేసే వ్యక్తులు కూడ పుట్టారేమో అనిపిస్తుంది. కాలాంతకులంటే వీళ్ళేనేమో!

## 'హమారా భారత్'

తీరిగ్గా కూర్చుని, తనేంటో, తన బాధ్యత ఏంటో తెలుసుకోకుండా ఊరికే దేశాన్ని ఆడిపోసుకొంటూ, విదేశాల మోజువైపు ఆకర్షితులు అయ్యే గొప్పవారు చాలామందిని చూస్తుంటాం. మనదేశం కూడా చాలా విషయాలలో ప్రపంచ ప్రసిద్ధిపొందిన సంగతిని బాగా గుర్తుంచుకోవాలి. ఈనాడు ప్రపంచం మొత్తంలో క్వాలిటీపరంగా 'బెస్ట్' సైకిళ్ళను తయ్యారుచేసి, విదేశాలకు ఎగుమతి చేస్తోందట. సంవత్సరానికి కోటికిపైగా సైకిళ్ళను ఉత్పత్తి చేసే దేశం మనదే! యాభై సంవత్సరాల క్రితం మనదేశం ఎగుమతి చేసే సీఫుడ్స్ విలువ సంవత్సరానికి రెండు కోట్లు వుంటే, ఈనాడు అది ఆరువందల ముప్పై అయిదు కోట్లకు చేరుకొందంటే ఆలోచించండి. మనదేశం గొప్పతనం! అందుకే ప్రతి మనిషి ''మేరా భారత్ మహాన్ హై'' అంటూ గర్వంగా చెప్పుకొంటూ, తనవంతు కృషిని మర్చిపోకుండా సహకరించాలి.

— 'శర్మాజీ'